# పునరావృత్తం

ఆ రోజు లీలామహల్లో మంచి ఇంగ్లీషు సినిమా. టిక్కెట్లు దొరకడం మహా కష్టంగా కనిపించింది. క్యూ మాత్రం హనుమంతుని తోకలా వుంది. సెకండ్ షో సినిమా చూసిన తర్వాత, రామారావు కోణార్క్‌లో హైద్రాబాద్ వెళ్లాలి. చుట్టుపట్ల బోలెడన్ని సినిమాలున్నాయి కానీ, తెలుగు సినిమాలు దొరకడం మరీ కష్టం. మేనేజరు చెట్టిగారు కనపడలేదు. చెట్టిగారుంటే ఒక్క టిక్కెట్టేమిటి- ఎన్ని టిక్కెట్లయినా దొరుకుతాయి. ఎందుకంటే వారిద్దరూ ఫ్రెండ్సు కాబట్టి. క్యూలో నుంచున్న వాళ్లని కొందరు బతిమలాడి టిక్కెట్లు సంపాదిస్తున్నారు. లేడీస్ క్యూ సెపరేట్‌గా వుంది. అక్కడ కూడా సుమారుగా క్రిక్కిరిసిపోయే వుంది.

ఎందుకైనా మంచిదని రామారావు రెండు క్యూలవైపు ఒకసారి పరికించి చూశాడు. ప్రయోజనం అట్టే కనపడలేదు. లేడీస్ క్యూ మాత్రం కర్పూరంలా తరిగిపోతోంది. ధైర్యం చేసి రామారావు క్యూలో వున్నవారిలో ఆఖరివారిని గొంతు పెగిల్చి "ఏమండీ" అని అన్నాడు. అంతే!! ఆమె రామారావు వైపు చూడడం, రామారావు ఆమెవైపు చూడడం, 'మీరా', 'మీరా' అని అనుకోవడం- జరిగిపోయాయి. ఆమె సాక్షాత్తు లలిత- ఒకప్పుడు రామారావు భార్య. పదిహేను సంవత్సరాల తర్వాత ఇప్పుడే ఒకర్నొకరు చూస్కోవడం.

"మీకు టిక్కెట్టు కావాలా...

నేను తెస్తానులెండి" అంది లలిత.

లలిత వచ్చే లోపున రామారావుకు ముచ్చెమటలు పోశాయి. బుర్ర వేడెక్కింది. ఒళ్లంతా ఓ మారు గోక్కోవాలనిపించింది. ఫ్యాన్ క్రింద వెళ్లి నుంచుంటే, లలిత ఒయ్యారంగా వచ్చి ప్రక్కన నుంచుంది.

ఒకర్నొకరు కుశల ప్రశ్నలు వేసుకున్న తర్వాత, సినిమాకు బోలెడంత టైమ్ వుందని తెలుసుకున్నాక, పక్కనే వున్న ఊటీ హోటల్లోకి దారి తీశారు. నడుస్తున్నంత సేపూ రామారావు అదోలా ఫీల్ అవుతున్నాడు. లలిత మాత్రం ఎంతో క్యాజువల్‌గా, ఏమీ తెలియనట్లుగా, ఎంతో ఫ్రెండ్లీగా మాట్లాడసాగింది.

ఆమెతో మాట్లాడుతూనే రామారావు గతంలోకి ఓ దూకు దూకి, సింహావలోకనం చేసుకోసాగాడు. విజయవాడ సీతారాంపురంలో లలిత సొంత ఇంట్లో ఓ పోర్షన్‌లో రామారావు అద్దెకుండేవాడు. అప్పట్లో లలిత కాలేజీ స్టూడెంటు. ఓ విధంగా ఇంటెలిజెంట్ అనే చెప్పాలి. రామారావు గవర్నమెంట్ ఆఫీసు గుమాస్తా. బాగా చదువుకున్న వ్యక్తి. నమ్మదగ్గవాడు. గుణవంతుడు. గంగరాజు స్వతం ప్రాంతంలో రామారావు ఫలానా వుద్యోగి అంటే తెలియని వారుండరు. లలిత ఇంటెలిజంటే కాక, బాగా యాక్టివ్. బోలెడంత మంది ఫ్రెండ్సు, సినిమాలు, నాటకాలు... వుత్సాహంగా, కలుపుగోలుగా వుండేది. అయితే లలిత కొంత మందితో ఎబ్బెట్టుగా తిరగడం వాళ్ల ఇంటిలో నచ్చని విషయం.

అంచేత, ఆ రోజుల్లో వాళ్ల తల్లిదండ్రులు రామారావుపై ఆశలు పెట్టుకోవడమే కాక, ఏదో విధంగా అతన్ని పెళ్లికి ఒప్పించారు. ఆమె కాలేజీ స్టడీస్ అవడం, పెళ్లి జరిపించడం ఒకే సంవత్సరంలో ముగిశాయి.

కాని, ఎంతో చలాకీగా వుండాల్సిన లలితలో కొన్ని మార్పులు ఉదయించాయి. ముభావంగా వుండడం, అప్పుడప్పుడు రామారావుతో ఏదో విధంగా గిల్లికజ్జాలు పెట్టుకోవడం, గుమాస్తాగిరి అంటే అసహ్యంగా చూడడం, డబ్బులు చాలడం లేదని అసంతృప్తి, నైరాశ్యం వంటి వికారాలు చోటుచేసుకున్నాయి.

ఇవి చాలవన్నట్టు ఆమె జతలో చదువుకున్న సీనియర్ విద్యార్థి సూర్యంతో అప్పుడప్పుడు తిరగడం వంటి విషయాలు అందరికీ తెలిశాయి. సూర్యం బాగా డబ్బున్నవాడు, అందగాడు, మాటకారి. రామారావు వీరిద్దరి విషయంలో కలుగజేసుకోకుండా ఒక విధంగా తనకు తానే సాని చేసుకున్నాడు.

లలిత సూర్యంతో విజయవాడ వదిలిపెట్టి వైజాగ్ చేరింది. వైజాగ్ నించి రామారావుకు వ్రాసిన ఉత్తరంలో సారాంశం ఇలా వుంది-

"మీ పక్కన నేను రాణించలేనని నాకు బాగా తెలుసు. అయినా కొన్ని కారణాల వల్ల మిమ్మల్ని పెళ్లి చేసుకున్నాను. నాకు పెళ్లి సరదా తీరింది. కాని జీవితంలో పట్టు దొరకలేదు. నా ప్రస్తుత పరిసరాల్లో నాకు నచ్చిన స్నేహితులు, ఉద్యోగం, డబ్బు, అన్నిటికీ మించిన కొత్త కొత్త అవకాశాలు ఎన్నో వున్నాయి. బంధాలతో, అనుబంధాలతో తులతూగడం నాకు కష్టసాధ్యం. అంచేత నన్ను మర్చిపోండి".

అది చదివాక రామారావెంతో రిలీఫ్ ఫీలయ్యాడు అప్పటికప్పుడు. కానీ, క్రమేణా ఏళ్ళు గడవడంలో కొంత బాధ, వెలితి, భ్రమ, అనుభూతి ఒక్కొక్కటి కనిపించసాగాయి. ఒంటరితనంలో ఒక విధమైన విసుగు, వైఫల్యం చోటు చేసుకున్నాయి. కాని తిరిగి పెళ్లి చేసుకునేందుకు మానసికంగా, వ్యక్తిగతంగా, సాంఘికంగా ఏ మాత్రం మొగ్గు చూపడం లేదు. లలిత

ప్రొఫెసర్ ఎస్. చంద్రశేఖర్



ఎప్పటికైనా రాకపోతుందా అనే ఊహ, ఆశ కూడా ఒకోసారి చనిపోయాడు ఈ పదిహేనేళ్ళలో.

అప్పుడనిపించిందేమిటంటే, మానవుడు వింత జీవి. ప్రకృతి ప్రాబల్యంలోని ఘటనలూ, సంఘటనలూ మానవుని పరిధులు. ఈ పరిధులు పురుషునికి వర్తించినంతగా స్త్రీకి వర్తించవు. కారణం స్త్రీ ప్రకృతికి చేరువవడమే.

ప్రకృతిలోని పరిపూర్ణత స్త్రీకి స్వంతం. స్త్రీకి ప్రతి విషయం సాధారణం. పురుషునికి ప్రతి విషయం సాధన, శ్రమ, ఘర్షణ, స్పందన, ప్రతిస్పందన, ప్రేరేపణ లాంటివి- పురుషునిలో నైతికంగా కనిపించనివి. అందుకే కొన్ని విషయాల్లో పురుషుడు ప్రత్యేకించి పరిశోధించాలి, కృషి చేయాలి.

ఏమైనా లలిత రాలేదు. రామారావు హైద్రాబాదుకు ఉద్యోగరీత్యా వెళ్లాడు. విశాఖ రావడం కూడా ఉద్యోగరీత్యానే. లలితను అనుకోకుండా కలవడం ఒక వింత సంఘటన.

కాఫీ తాగిన తర్వాత, ఊటీ నించి ఆ కాస్త దూరం పక్క పక్క నడవడం కొంత గుర్రాటు కలిగించింది. లలిత మాత్రం సవ్యంగా, నాజూగ్గా, సహజంగా కనిపిస్తోంది.

సినిమాలో పక్క పక్కన కూర్చున్నారు. కాని మాట్లాడే అవకాశం అట్టే రాలేదు. వైజాగ్‌లో దాదాపు సెటిల్ అయినట్టుగాను, జీవితంలోని సటుత్వాన్ని ప్రత్యేకతతో అనుభవిస్తున్నట్లుగాను కనిపించింది. మనిషిలో పెద్ద మార్పులు లేవు. ఓ విధంగా ఆకర్షణ పెరిగింది.

సినిమా అయిన తర్వాత కార్యక్రమం గూర్చి రామారావు ఆలోచించసాగాడు. 'లలిత తనని తన ఇంటికి పిలుస్తుందా? పిలిస్తే తన కోణార్క్ ప్రయాణం కాన్సిల్ చేసేసి మరుసటి రోజు పోవచ్చును-' అనుకున్నాడు. సూర్యం గురించి ప్రశ్నించడం అనవసరం అనిపించింది- ఎందుకంటే ఆమె ఒంటరిదానిలాగే కనిపిస్తోంది కాబట్టి.

ఆమె పరిస్థితులు ఒక విధంగా రామారావుకు అనవసరం. ఇన్ని సంవత్సరాల తర్వాత కనపడిన లలితను లలితలాగే చూడాలనుకున్నాడు. అదే స్త్రీలోని ప్రత్యేకత. ఆ క్షణంలో రామారావు వెంట వస్తానని చెప్పినుంటే లలితని అమాంతం హత్తుకునేవాడు.

ఎందుకైనా మంచిది, లలిత మనసులో ఏముందో అని సినిమా చూస్తూ చూస్తూ, ఒక్కసారి లలిత చేయి పుచ్చుకొని మృదువుగా నొక్కాడు. లలిత చిరునవ్వు పులుముకుని,

ఆమె కూడా ఒక్కసారి అతని చేతిని నెమ్మదిగా పట్టుకుంది.

అంతే! దాని తర్వాత, చంద్రుని కోసమై ఉవ్వెత్తున ఎగిరే అలల్లా, రామారావు గుండెలో విచిత్రమైన విన్యాసాలు, విమాత్నమైన నికికిళ్లు వినపడసాగాయి. ఎన్నో సంవత్సరాల తరువాయి మీటిన వీణలోని వినిపించని సవ్వడిలో విహంగంలా విహరించాడు.

ఇంతలో గణగణమంటూ ఇంటర్వెల్ బెల్ మోగింది. వారి ఇద్దరి కలలూ కలయికలూ వాస్తవంలోకి విడివిడిగా అడుగుపెట్టాయి.

రామారావు లేచి నుంచున్నాడు. పాప్‌కార్న్ తీసుకొస్తానని బయటికి దారితీశాడు. బాత్‌రూమ్ వైపు ముందు నడక సాగించి, ఆనక హాలు బయటికి నడిచాడు. పాప్‌కార్న్ తీసుకొని ఎంతో ధైర్య స్థైర్యాల్తో, ఆహ్లాదకరమైన చిరునవ్వుతో తమ సీట్ల వైపు నడిచాడు. అంతే! లలిత అదృశ్యమయింది. గబగబా బయటికి నడిచి లలిత ఎక్కడుందా అని చూశాడు. లలిత ఎక్కడా లేదు.

ఇప్పుడు జరిగిందే పదిహేను సంవత్సరాల క్రితం జరిగింది. ●

షాడో
మధుబాబు
ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం
ప్రత్యేకంగా రాస్తున్న సీరియల్
?
వివరాలు వచ్చే సంచికలో